# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-04-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. లోక్‌సభ ఎన్నికలకు మూడవదశ నామినేషన్ పత్రాల పరిశీలన నిన్నటితో ముగిసింది.**

**2. పేదలను గెలిపించడమే తమ లక్ష్యమని వైఎస్ఆర్‌సిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి తమ ఎన్నికల ప్రచారంలో వెల్లడించారు.**

**3. ఈ నెల 24వ తేదీ నుంచి తెలంగాణలో బిఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖరరావు బస్సుయాత్ర చేపట్టనున్నారు.**

**4. ఆంధ్రప్రదేశ్‌లో పదవ తరగతి పరీక్షా ఫలితాలు రేపు విడుదల కానున్నాయి.**

**5. జైనమత వ్యవస్థాపకుడైన వర్ధమాన మహావీరుని జయంతిని ఈరోజు దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నారు.**

=========================

మూడవ దశ లోక్‌సభ ఎన్నికల నామ పత్రాల పరిశీలన నిన్న ముగిసింది. మూడవ దశ నామినేషన్ల దాఖలు గడువు శుక్రవారం ముగియగా, నామినేషన్ల ఉపసంహరణకు సోమవారం ఆఖరి రోజు. మూడో దశలో 10 రాష్ట్రాలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల్లోని 94 లోక్‌సభ నియోజకవర్గాలకు మే 7న ఎన్నికలు జరుగుతాయి. అదే సమయంలో గుజరాత్‌లోని 5 అసెంబ్లీ సీట్లకు జరిగే ఉపఎన్నికలకు కూడా నామినేషన్ పత్రాల పరిశీలన శనివారం ముగిసింది.

-------------------------

ప్రజలకు మేలు చేసిన ధైర్యంతోనే ఎన్నికల్లో ఒంటరిగా ప్రజల ముందుకు వస్తున్నానని వైఎస్ఆర్‌సిపి అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. శనివారం అనకాపల్లి జిల్లా చింతలపాలెం వద్ద నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పేదలను గెలిపించడమే తమ పార్టీ లక్ష్యమని చెప్పారు. ఈ ఎన్నికలు చరిత్రలో నిలిచిపోతాయని వ్యాఖ్యానించారు.

-------------------------

తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతిపక్ష బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు బస్సుయాత్ర చేపట్టనున్నారు. ఈనెల 24 నుంచి మే 10 వరకూ నిర్వహించే

బస్సుయాత్రలో 17 రోజులు 21 పట్టణాల్లో రోడ్ షోలు నిర్వహిస్తారు. కేసీఆర్ బస్సుయాత్ర నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో మొదలై, సిద్దిపేటలో ముగుస్తుంది. వేసవి ఎండల తీవ్రత కారణంగా సాయంత్రం 5న్నర గంటల తర్వాతే రోడ్ షో నిర్వహిస్తారని పార్టీ వర్గాలు తెలియజేసాయి. ఉదయం వేళల్లో స్థానికంగా ఉండే పంటపొలాలను, ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేసీఆర్ పరిశీలిస్తారని వెల్లడించాయి.

---------------------------

జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తూర్పుగోదావరి జిల్లా కోరుకొండలో ప్రచార యాత్ర నిర్వహించారు. జనసేన–టిడిపి–బిజెపి కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే కోరుకొండ పరిధిలోని దేవదాయ ధర్మదాయ శాఖ భూములకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తామన్నారు. రాష్ట్రం సమగ్ర అభివృద్ధి చెందాలంటే ఎన్డీయే కూటమి అధికారంలోకి రావాలన్నారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు పురందరేశ్వరి మాట్లాడుతూ వైఎస్ఆర్‌సిపి పాలనలో రాష్ట్రంలో ఏ రంగమూ అభివృద్ధి చెందలేదని విమర్శించారు.

---------------------------

ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలను ఈ నెల 24వ తేదీన విడుదల చేస్తామని తెలంగాణ విద్యాశాఖ నిర్ణయించింది. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పరీక్షా ఫలితాలనూ అదే రోజు ఉదయం 11 గంటలకు ప్రకటిస్తారు. తెలంగాణలో ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకూ జరిగిన ఇంటర్మీడియెట్ పరీక్షలకు సుమారు 9లక్షల 81వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. మార్కుల నమోదులో ఎలాంటి సాంకేతిక సమస్యలూ తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నామని, జవాబు పత్రాలను మూడేసి సార్లు పరిశీలించామని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పదవ తరగతి పరీక్షా ఫలితాలు రేపు విడుదల కానున్నాయి. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ రేపు ఉదయం 11 గంటలకు విజయవాడలో పదవ తరగతి పరీక్షా ఫలితాలను విడుదల చేస్తారు. ఈ ఫలితాలను results.bse.ap.gov.in. వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

---------------------------

ఈరోజు పౌర సేవల దినోత్సవం.....సివిల్ సర్వీసెస్ డే నిర్వహిస్తున్నారు. ప్రజలకు పౌర సేవల అధికారులు మెరుగైన సేవలు అందించడం..., తద్వారా ప్రజలు వారి... వారి ప్రాథమిక హక్కులు పొందేలా చూడడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. భారతదేశ మొదటి హోం మంత్రిగా వ్యవహరించిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ 1947 ఏప్రిల్ 21 వ తేదీన మొదటి బ్యాచ్ పౌర సేవల ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించిన రోజును గుర్తు చేసుకుంటూ... 2006వ సంవత్సరం నుండి ప్రతి ఏటా ఏప్రిల్ 21 న పౌర సేవల దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పౌర సేవల విభాగంలో ఉత్తమ సేవలు అందించిన వారికి పురస్కారాలు అందజేస్తారు.

---------------------------

జైనమత వ్యవస్థాపకుడైన మహావీరుడి 2550వ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ ఉదయం 10గంటలకు భగవాన్ మహావీర్ నిర్వాణ మహోత్సవ కార్యక్రమాన్ని దేశ రాజధాని న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ప్రారంభిస్తారు. మహావీరుని స్మారక స్టాంపును, నాణేన్ని విడుదల చేస్తారు. ఆ సందర్భంగా నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానమంత్రి ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా భారత్ మండపంలో జైన సాధువుల సమక్షంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. జైన తీర్థంకరులలో 24వ వాడైన భగవాన్ మహావీరుడు

శాంతియుత సహజీవన మార్గాన్ని ప్రబోధించాడు. అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం వంటి నియమాల ద్వారా సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని ప్రచారం చేసాడు.

---------------------------

తూర్పు కోస్తా రైల్వేలోని వాల్తేరు డివిజన్‌లో 52 వేసవి ప్రత్యేక రైళ్ళను, 12 జతల అదనపు రైళ్ళను నడుపుతామని డివిజనల్ రైల్వే కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠీ ఒక ప్రకటనలో వెల్లడించారు. వేసవిలో ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు ఆయన తెలియజేసారు. దానికోసం పిఆర్ఎస్ సిస్టంలోని వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికుల వివరాలతో పాటు, వివిధ మాధ్యమాల ద్వారా వివరాలు సేకరిస్తామని వివరించారు. వేసవి సందర్భంగా డివిజన్లోని రైల్వేస్టేషన్లలో ప్రయాణికులకు తాగునీరు అందుబాటులో ఉంచాలని డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో శనివారం నాడు దాఖలైన నామినేషన్ల వివరాలను ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి 37 నామినేషన్లు దాఖలయ్యాయి. అలాగే రాష్ట్ర శాసనసభకు సంబంధించి మొత్తం 227 నామినేషన్లు దాఖలయ్యాయి. మన రాష్ట్రంలో నామినేషన్ల దాఖలుకు ఈ నెల 25వ తేదీ వరకూ గడువు ఉంది. నామినేషన్ల పరిశీలన 26వ తేదీన జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 29వ తేదీ ఆఖరి రోజు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 25 లోక్‌సభ, 175 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ మే 13తేదీన జరుగుతుంది

---------------------------

ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, ఇతర సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ పొందేందుకు రేపటిలోగా దరఖాస్తు చేసుకోవాలని విజయనగరం జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి నాగలక్ష్మి సూచించారు. పోస్టల్ బ్యాలెట్లు పొందే అర్హత ఉన్నవారికి ఇప్పటికే దరఖాస్తులు అందజేసామని, వాటిని సోమవారం సాయంత్రంలోగా సంబంధిత నియోజకవర్గ కేంద్ర తాసీల్దార్ కార్యాలయంలో అందజేయాలనీ వెల్లడించారు. గడువు దాటిన తరవాత అందే దరఖాస్తులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉండదని వివరించారు

---------------------------

రెండో దశ ఎన్నికలకు ప్రచారపర్వం ఊపందుకుంది. అన్ని పార్టీలకు చెందిన సీనియర్ నాయకులు, ప్రధాన ప్రచారకర్తలు దేశవ్యాప్తంగా ర్యాలీలు, ప్రచారాలు నిర్వహిస్తున్నారు. రెండోదశ ఎన్నికల్లో కేరళలోని 20 స్థానాలు, కర్ణాటకలోని 14 స్థానాలు, రాజస్థాన్‌లోని 13 సీట్లు, ఉత్తరప్రదేశ్–మహారాష్ట్రల్లో చెరో 8 సీట్లు, మధ్యప్రదేశ్‌లో 7 నియోజకవర్గాలు, అస్సాం–బీహార్ రాష్ట్రాల్లో చెరో 5 స్థానాలు, పశ్చిమబెంగాల్–ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో చెరో 3 సీట్లు, త్రిపుర, జమ్మూకశ్మీర్‌లలో చెరో నియోజకవర్గంలోనూ ఈ నెల 26వ తేదీన పోలింగ్ జరగనుంది.

---------------------------

భారత నౌకాదళం శనివారం సాయంత్రం తూర్పుతీరంలో “పూర్వీ లెహర్” పేరిట నౌకా విన్యాసాలు చేసింది. తూర్పుతీర సాగరజలాల్లో భద్రతా సవాళ్ళను ఎదుర్కోడంలో నౌకాదళం సంసిద్ధతను అంచనా వేయడానికి ఈ విన్యాసాలు నిర్వహించారు. ఆ కార్యక్రమంలో ఓడలు, జలాంతర్గాములు, విమానాలు, ప్రత్యేక బలగాలు పాల్గొన్నాయి. వ్యూహాత్మక దశలో యుద్ధం చేయడం, ఆయుధ దశలో ఆయుధాలను వినియోగంచడం వంటి

సందర్భాలను వాస్తవిక పరిస్థితుల్లో ఎలా చేయాలో శిక్షణ ఇచ్చారు. వేర్వేరు ప్రదేశాలనుంచి విమానాలను ఒకేసారి ప్రయోగించి, భారత నౌకాదళం సర్వసన్నద్ధతను చాటారు. ఈస్టర్న్ నేవల్ కమాండ్, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, అండమాన్ నికోబార్ కమాండ్, కోస్ట్‌గార్డ్ దళాలు ఈ విన్యాసాల్లో పాల్గొన్నాయి.

---------------------------

ఏలూరు జిల్లాలో ఈ సీజన్లో ఇప్పటివరకూ 3117 మంది రైతుల నుంచి సుమారు 81 కోట్ల రూపాయల విలువైన 37వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసామని జిల్లా జాయింట్ కలెక్టర్ బి లావణ్యవేణి తెలిపారు. శనివారం ధాన్యం కొనుగోళ్ళపై సంబంధిత అధికారులతో ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆ సందర్భంగా మాట్లడుతూ ధాన్యంలో తేమ శాతం, ఇతర నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి అవసరమైన సుమారు 76 లక్షల గోనెసంచులు, 200కు పైగా జిపిఎస్ వాహనాలను సమకూర్చినట్లు తెలియజేసారు.

---------------------------

ఐపిఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో నిన్న ఢిల్లీ క్యాపిటల్స్, సన్‌రైజర్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 67 పరుగులతో విజయం సాధించింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ 266 పరుగుల భారీ స్కోరు చేయగా, ఢిల్లీ క్యాపిటల్స్ 199 పరుగులకు ఆలౌట్ అయింది.

---------------------------

ఎన్నికల రిటర్నింగ్ అధికారులు పెండింగ్ క్లెయిమ్స్‌ను ఈ నెల 25వ తేదీలోగా తప్పకుండా పూర్తి చేయాలని, అలాగే సెక్టోరల్ అధికారులు పోలింగ్ కేంద్రాల్లో కనీస సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలనీ తిరుపతి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ ఆదేశించారు.

=====================